


# రమణ భాస్కర

ఆధ్యాత్మిక పక్షపత్రిక 5-3-2001 ⑥



## శ్రీ రమణ క్షేత్రం - జిన్నూరు

పశ్చిమ గోదావరి జిల్లా - ఆంధ్రప్రదేశ్. పిన్ : 534 265

## సద్గురు శ్రీనాన్న గారి అనుగ్రహ భాషణములు

| | |
|---|---|
| 7-3-2001, బుధవారం | ఆత్రేయపురం (రావులపాలెం దగ్గర) |
| 8-3-2001, గురువారం | చించినాడ - గీతా మందిరం |
| 9-3-2001 నుండి 15-3-2001 | అరుణాచలం క్యాంప్ |
| 21-3-2001, బుధవారం | యండగండి |
| 25-3-2001, ఆదివారం | కోపల్లె |
| 30-3-2001, శుక్రవారం | జిన్నూరు - శ్రీ రమణ క్షేత్రం |
| 2-4-2001, సోమవారం | పాలకోడేరు రామాలయంలో - శ్రీ రామనవమి |
| 3-4-2001, మంగళవారం | భీమవరం - ఆదర్శ నగర్ |
| 4-4-2001, బుధవారం | చింతపల్లి (దువ్వ - చిలకంపాడు మధ్య) |
| 11-4-2001, బుధవారం | ఐ-భీమవరం |
| 13-4-2001, శుక్రవారం | భీమవరం - సీతారామరాజు కళ్యాణ భవనం |
| 19-4-2001, గురువారం | పాలకొల్లు - పెన్మెత్స సత్యనారాయణ రాజు & సూర్య పద్మావతి క్షత్రియ సంక్షేమ పరిషత్ కళ్యాణ మండపం |

## సద్గురు శ్రీ నాన్నగారిచే జూనియర్ కాలేజీ నూతన భవన శంఖుస్థాపన

లంకలకోడేరు గ్రామమందు అమృత ఎడ్యుకేషన్ ట్రస్ట్ మరియు వశిష్ట ఎడ్యుకేషన్ ట్రస్ట్‌ల ఆధ్వర్యంలో నడుస్తున్న సహకార జూనియర్ కాలేజీ నూతన భవన శంఖుస్థాపన ది॥ 17-3-2001 ఉదయం గం॥ 5-57లకు సద్గురు శ్రీ నాన్నగారు చేసెదరు. ఈ కాలేజీ అభివృద్ధికి అకుంఠిత దీక్షతో శ్రమిస్తూ, చుట్టుప్రక్కల గ్రామాలలోని బాలికల విద్యాభివృద్ధికి శ్రీ అల్లూరి శివాజీరాజుగారు (రిటైర్డ్ జియో ఫిజిక్స్ ప్రొఫెసర్, ఆంధ్రా యూనివర్శిటీ) వారు ఈ కాలేజీ కరెస్పాండెంట్ మరియు సెక్రటరీగా ఉంటూ కృషి చేయుచున్నారు.



ఓం నమోభగవతే శ్రీరమణాయ

# రమణ భాస్కర



సంపుటి : 6 సంచిక : 6 పుష్పం : 17-19 05-3-2001



**RAMANA BHASKARA**
**TELUGU SPIRITUAL FORTNIGHT MAGAZINE**
PAGES : 12

**VOL: 6** **ISSUE: 6**

EDITOR
**P. S. RAMA RAJU**

EDITING
**P.H.V. SATYAVATHI (HYMA)**

**SUBSCRIPTION**
YEARLY : **Rs. 140/-**
Each Copy : **Rs. 10/-**

ADDRESS
**RAMANA BHASKARA**
SRI RAMANAKSHETRAM
JINNURU - 534 265
W.G.Dt., A.P.

**PUBLISHER**
P.S.RAMARAJU
LAKSHMI MODERN RICE MILL
ULLAMPARRU - PALAKOL
☎ 08814 - 24589, 24689

**PRINTER**
SHRIRAM GRAPHICS
BANK STREET - PALAKOL
☎ 08814 - 22438, 24278


## విద్య

ఆత్మస్వరూపజ్ఞానం లేకపోవటం అవిద్య. అట్టి అవిద్యఉన్న మనస్సుకు సాంకేతిక విద్య ఒకటే నేర్పటం సమగ్రమైన విద్య కాదు. ఇట్టి విద్యావ్యవస్థ అవిద్యలో వేళ్ళూనికొని ఉంది. అందుచేత ఆవ్యవస్థయొక్క ఫలములు కూడా అవిద్యారూపంలోనే ఉంటాయి. అనగా దాని ఫలితాలు అశాశ్వతంగా ఉంటాయి.

సాంకేతికవిద్య నేర్పడంతోబాటు, అజ్ఞాన జనితమైన మానవ మనస్సు సంస్కరింపబడే ప్రయత్నం చేయాలి. "అబద్దపు నేను" యొక్క కదలిక ఇతరులతో ఉన్న సంబంధం అనే దర్పణంలో మాత్రమే వ్యక్తమౌతుంది కనుక, విద్యార్థి దశనుంచి కూడా ఇతరులతో సంబంధంలో "అబద్దపు నేను" యొక్క కదలికను నిరంతరం ఎఱుకతో గమనించమని విద్యార్థులను ప్రోత్సహించాలి. ఆత్మజ్ఞానులతో వారికి పరిచయము కలిగించాలి.

సంస్కరింపబడిన మనస్సుకు ఏవిద్య నేర్పినప్పటకీ, అది మానవ కళ్యాణానికి ఉపయోగపడుతుంది. సంస్కరింపబడని మనస్సుకు నేర్పిన విద్య, సరైన విధంగా ఉపయోగపడక, మంచికన్నా చెడు ఎక్కువ జరుగుతుంది.

అందుచేత విద్యావ్యవస్థలో సమూలమైన మార్పురావాలి. ఆ వ్యవస్థ యొక్క వేళ్ళు ఆత్మజ్ఞానంలో ఉండాలి. వ్యవస్థయొక్క దృష్టి మనస్సు సంస్కరించటం ముఖ్యంగా తీసుకోవాలి. సాపేక్ష జ్ఞానం (Relative Knowledge) ద్వారా నేర్చిన విద్యల వల్ల అశాశ్వతమైన భౌతిక అవసరాలు తీరతాయి. ఆత్మ విద్య (Absolute Knowledge) వల్ల శాశ్వతమైన ఆనందమయ జీవితం శిద్ధిస్తుంది.

.... ఎడిటర్

## ఈ సంచికలో............

### సద్గురు శ్రీ నాన్నగారి అనుగ్రహ భాషణములు


05-01-2001 గరగపర్రు .................... 2
29-12-2000 తాడేపల్లి గూడెం .................... 5
10-01-2001 జిన్నూరు .................... 9

# ఫలాపేక్ష మీద దృష్టి పెట్టుకొని చేసే పని హీనాతిహీనము

## సద్గురు శ్రీ నాన్నగారి అనుగ్రహభాషణములు, 5-1-2001, గరగపర్రు

ప్రియమైన ఆత్మబంధువుల్లారా!

పూజ చేతులతో చేస్తాము, జపం నోటితో చేస్తాము, ధ్యానం మనస్సుతో చేస్తాము. పూజ చేసినా, జపం చేసినా, ధ్యానం చేసినా వ్యవసాయాత్మక బుద్ధి ఉండాలి అని భగవంతుడు చెప్పాడు అంటే ఏకాగ్రమైన బుద్ధి ఉండాలి. ఏకాగ్రత లేకుండా మోక్షం రాదు. పుణ్యం ప్రధానం కాదు, అనుభవిస్తే పోతుంది. కర్మానుభవంలో పుణ్యం, పాపం రెండూపోతాయి. ముముక్షువుయొక్క లక్ష్యం పుణ్యంకాదు, మోక్షమేవాడి లక్ష్యం. మనం ఏ పనిచేసినా మోక్షాన్ని దృష్టిలోపెట్టుకొని చేయాలి. మనం భౌతికంగా అభివృద్ధిలోనికి రావాలన్నా, ఆధ్యాత్మికంగా అభివృద్ధిలోనికి రావాలన్నా ఏకాగ్రత, పవిత్రత రెండూ ముఖ్యమని పెద్దలు చెపుతారు. పూజవలన, జపం వలన, ధ్యానం వలన ఏకాగ్రత వస్తుంది. త్రికరణశుద్ధి వలన పవిత్రత వస్తుంది. మనస్సు, మాట, చేత నిదానంగా ఉంటే పవిత్రత కలుగుతుంది. ధ్యానంకంటే కూడా స్వార్థచింతనలేకుండా జనులకు సేవచేయటం గొప్పది అని పెద్దలు చెపుతారు. తల్లి కడుపులోనుండి బయటకు వచ్చాక ఈ శరీరానికి ఒక పేరు పెట్టారు. ఈపేరు నాది అని ఆశరీరం చెప్పదు. ఆపేరుతోటి తాదాప్యం వదలలేకపోతున్నాము ఇంక మోక్షం ఎలా వస్తుంది. ఆపేరుతోటి స్తోత్రం చేస్తే సంతోషం, విమర్శిస్తే దుఃఖం. ఆపేరుతోటి తాదాప్యం మీకు పోవటంలేదు. నీవు గమ్యాన్ని కరెక్టుగా నిర్ణయించుకోవాలి. నీవు నెమ్మదిగా ప్రయాణం చేసినా మార్గం కరెక్టుగా ఉండాలి. లోకంలో అనేక ఆకర్షణలు ఉంటాయి, ఏ ఆకర్షణకు లోనుకాకుండా ఉంటేనేవాడు మోక్షాన్ని పొందుతాడు. ఎంతటివాడికైనా ఈశ్వరానుగ్రహం లేకపోతే, కాలం కలసిరాకపోతే, సాధనాబలం లేకపోతే వాడికి వ్యక్తి భావన నశించదు. వ్యక్తి భావన నశించకుండా వాడికి ఆత్మానుభవం కలుగనే కలుగదు. శాస్త్ర పాండిత్యం ఎక్కువగా ఉన్నవారికి అసలురాదు ఎందుచేతనంటే వారు జ్ఞానాన్ని పాండిత్యంలో వెతుకుతారు. భగవంతుడు మీ హృదయంలో ఉన్నాను అని చెప్పాడుకాని శాస్త్రంలో ఉన్నానుఅని చెప్పలేదు. శాస్త్రంలోని వాక్యాన్ని ప్రమాణంగా పెట్టుకొని మీ హృదయంలో ఉన్న నన్ను వెతకమని భగవంతుడు చెప్పాడు. చాలామందికి భక్తి ఉంది కాని శక్తిలేదు. నీ భక్తి నిజమైతే నీకు శక్తి వస్తుంది. నీకు లోచూపు కలుగుతుంది. కొంతమందికి భక్తి ఉన్నా ప్రతీ చిన్నవిషయానికి రియాక్టు అవుతారు అంటే వారికి శక్తి లేదని అర్థం. మనం జీవితంలో సాధ్యమైనంతవరకు యాక్షన్ పెంచుకొంటూ వెళ్ళాలి, రియాక్షన్ తగ్గించుకొంటూ రావాలి అప్పుడు యోగివి అవుతావు.

మనలను మనం పరిశీలన చేసుకొంటే మనం మాట్లాడే మాటలలో జ్ఞానపరంగా

మాట్లాడే మాటలు తక్కువగా ఉంటాయి. అసూయతోటి, అహంభావనతోటి మాట్లాడే మాటలు చాలా ఎక్కువగా ఉంటాయి. జ్ఞానపరంగా మాట్లాడే మాటలవలన ఇతరులకు శాంతి కలుగుతుంది. అహంభావన పరంగా మాట్లాడే మాటలవలన నీకూ శాంతి ఉండదు, ఇతరులకు శాంతి కలుగదు. నీవు ఏ దేవతనయితే ఆరాధిస్తున్నావో ఆదేవతమీద నీకు నిష్ఠ, గౌరవం ఉండాలి. మనందరకు జ్ఞానం రాకపోవటానికి గర్వమేకారణం. నీవు ఆరాధించే దేవత అంటే నీకు ఎంత ఇష్టమో ఇతరులు ఆరాధించే దేవతలు అంటే వారికి కూడా అంతే ఇష్టం అని నీవు అనుకోవాలి. ఆమాత్రం నీకు సహనం లేకపోతే ఎలాగ? మనిషికి ధైర్యంతోపాటు సహనం ఉండాలి. నీరు పల్లానికి వెళ్ళినట్లు జ్ఞానం సహనం ఉన్నవాడిని వరిస్తుంది. నిజమైన బంగారం మన హృదయంలోనే ఉంది. దానిని ఓపెన్ చేయటానికి తాళం మన దగ్గర లేదు. దానికి ఏకాగ్రత అనే తాళం చెవి ఉండాలి. భగవంతుడి గురించి చెపుతూ పెద్ద మనస్సు కలవాడు, విశాలమైన మనస్సుకలవాడు, ఉదాత్తమైన మనస్సుకలవాడు అని చెపుతారు. అలాంటి గొప్పమనస్సును మనం సముపార్జించినప్పుడే ఆయన స్వరూపం మనకు ఇస్తాడు.

ఏవాంఛలేనివాడికి ఈ సృష్టి అంతా గడ్డిపరకతో సమానంగా కనబడుతుంది. గుర్తింపుకోసం పనిచేయవద్దు. నీవు చేసే పని కృత్రిమంగా చేయకు. మనప్రవర్తన ఎలా ఉంటే ఈశ్వరానుగ్రహానికి పాత్రులవుతామో అలాగ మన జీవితాన్ని తీర్చిదిద్దుకోవాలి అదే సాధన. బజారులో ఒక వస్తువు కొనాలంటే దాని ధర ఎంతో అది మనం చెల్లించాలి. అలాగే జ్ఞానం పొందటానికి కూడా మూల్యం చెల్లించవలసిందే. నీ అహంకారాన్ని, నీ దేహాభిమానాన్ని మోక్షం పొందటంకోసం బలిచేయవలసిందే. తెలుసుకొనేది జ్ఞానంకాదు, ఉండేది జ్ఞానం. ఏదైతే సత్యమో, ఏదైతే చైతన్యమో అలా నీవు ఉండగలగాలి. నీవు ఇతరులకు ఎంతవరకు సహకారం చేయగలుగుతావో అంతవరకు చెయ్యి. భౌతికంగా వాడికి సహకారం అందుతుంది. ఆధ్యాత్మికంగా నీకు లాభం ఏమిటి అంటే నీవు పవిత్రుడవు అవుతావు. లోపల వస్తువు ఎంత పవిత్రమైనదో అంత పవిత్రత నీకు వస్తేగాని ఆ వస్తువు నీ చేతికి అందదు. కేవలము ఫలాపేక్ష మీద దృష్టి పెట్టుకొని పనిచేసేవారు అంతాకూలివారే. పొలంలో పనిచేసేవారు కూలివారు కాదు మనం కూలివారము. ఈ కూలివారికి జ్ఞానం ఏమిటి అన్నాడు కృష్ణుడు. భగవంతుడు చెప్పిన మాటమీద మనకు ప్రమాణబుద్ధి ఉంటే అప్పుడు మనకు పొగరుబోతు తనం తగ్గుతుంది. ఇప్పుడు నీ మనస్సు ఎక్కడో ఒకచోట ఉంటోంది కదా దానిని నీ హృదయంలో అతిసహజంగా నిలబెట్టి ఉంచగలిగితే అప్పుడు మనస్సు అంతమవుతుంది. జపం ఎందుకు చేస్తున్నాము? మనో నిగ్రహానికే కదా. మనస్సు అక్కడ లేకపోతే మనోనిగ్రహం ఎలా కలుగుతుంది. నీవు ఏపని చేసినా యాంత్రికంగా చేయవద్దు. నీవు చేసేది శ్రద్ధగా, భక్తిగా చెయ్యి. నీ మనస్సు అక్కడ ఉండాలి. మనో నిగ్రహం లేకుండా

ఏదీ సాధించలేము. ఎవరో ఏదో అనుకొంటారు అని నీవు అనుకోవటంవలన నీకు భయం కలుగుతుంది, అది విడిచిపెట్టు. లోకంలో చాలామంది ఎదుటి మనిషిలో ఉన్న సుగుణాన్ని దుర్గుణంగా చూస్తారు. దానికి కారణం అసూయ. వారిని నీవు ప్రమాణంగా తీసుకొని దానిని బట్టి నీవు భయపడటమా. ఇదా నీ సాధన. నీ సొంత అవగాహనను, నీ సొంత ఆలోచనను విడిచి పెట్టవద్దు.

ఇతరులకు ఎవరికైనా నేను సహాయం చేస్తున్నాను అంటేవారికోసం చేయటం లేదు. వారు బాధపడుతున్నారు అని నా మనస్సు బాధ పడుతోంది. నా మనస్సుపడే బాధలో నుండి బయటకు రావటానికి వారికి సేవ చేస్తున్నాను అని లింకన్ చెప్పాడు. నీకు జయం కలిగినప్పడు సంతోషిస్తావు అంతేకాదు ఒక మంచిపనికోసం నీవుచేసే పోరాటంలో ఓడిపోయినా, ఓడిపోవటంలో కూడా ఆనందాన్ని అనుభవించటం నేర్చుకో. సముద్రంలో ఎంతో సంపద ఉంది. అదిపైన ఈదేవాడికి దొరకదు. లోపలకు మునిగిన వాడికి దొరుకుతుంది. అలాగే జపంకూడా పైపైన చమత్కారానికి చేస్తే లోపల ఉన్న బ్రహ్మం నీకు దొరకదు. జపంద్వారా నీవు లోపలకు మునగాలి అప్పడుకదా ఆత్మముత్యం నీకు దొరికేది. నీ మనస్సును ఆమంత్రం లోపలకు ముంచాలి. మంత్రం చేసేటప్పడు ఇతరులు జ్ఞాపకం వస్తూ ఉంటే నీ మనస్సు ఆ మంత్రం మీద లేదు అని అర్థం. వారు అంటే నాకు ఇష్టం, వీరు అంటే నాకు ఇష్టం అని మనం చెపుతాముకాని మనమంటేనే మనకు ఎక్కువ ఇష్టం. మనకు ఎవడు అనుకూలంగా ఉంటేవాడు అంటే మనం ఇష్టపడతాము ఎందుచేతనంటే మన స్వార్థానికి వాడు ఎక్కువ ఉపయోగపడతాడు. తలంపురూపంలో వస్తేగాని నీ మనస్సులో ఏముందో నీకు తెలియదు. తలంపు రూపంలో రాకముందు కూడ నీ మనస్సులో ఏముందో భగవంతుడికి తెలుసు. మనకంటే మన బాగు ఈశ్వరుడికి ఎక్కువ తెలుసు అని మనకు తెలియటంలేదు. నేను నీ లోపలే ఉన్నాను అని భగవంతుడు చెపుతున్నాడు. ఉన్నమాట నిజంకాని, మనకు తెలియటంలేదు కాబట్టి లేడు అని అనుకొంటున్నాము. పెద్దలు వారు చూసి చెపుతున్నారు అక్కడ ఉన్నాడని వారు చెప్పినమాట మీద మనకు నమ్మకం లేదు, ఉన్నాడని మనకు తెలియదు ఇంక ఎలా మనం బాగుపడేది. దేవుని వాక్యాన్ని ప్రమాణంగా పెట్టుకోవాలి కదా. నీకు మనస్సు తెలుస్తోంది, దేహం తెలుస్తోంది. వాటికి ఆధారంగా లోపల ఉన్నది తెలియటం లేదు. గాఢ నిద్రలో నీవు దేహంతోటి, మనస్సుతోటి వేరుపడినప్పడుకూడా నీవు ఉన్నావని నీకు తెలుస్తోంది కదా. ఆ ఉనికిని పట్టుకోవటానికి నీ మనస్సును, నీ దేహాన్ని ఉపయోగించుకో. అదే సాధన. అదే సమగ్రత, అదే పూర్ణయోగం. నీ సాధనను పూజాగదికి పరిమితం చేయకు. నీ ప్రవర్తన దేహాభిమానాన్ని పెంచుకొనేటట్లు ఉండకూడదు. నీ దేహాన్ని, మనస్సును లోపల ఉన్న సద్వస్తువును తెలుసుకోవటానికి ఉపయోగించటమే పూర్ణయోగం.

# జీవునిలో ఉన్న దైవత్వాన్ని అనుభూతి చేసుకోవటమే సాధన లక్ష్యం

## సద్గురు శ్రీ నాన్నగారి అనుగ్రహభాషణములు, 29-12-2000, తాడేపల్లిగూడెం

ప్రియమైన ఆత్మబంధువుల్లారా!

స్వార్థం లేకుండా మనం ఏ పని చేసినా అది యజ్ఞమే. యజ్ఞం అంటే కోరిక లేని కర్మ అని గీతలో చెప్పాడు. ఏకోరికలేని వాడిని నిష్కాముడు అంటారు. కోరిక లేకుండా కర్మచేస్తే దానివలన వచ్చేఫలం మనస్సును మాలిన్యం చేయదు. కోరికలేకుండా కర్మచేస్తూ ఉంటే మనకు జీవలక్షణాలు తగ్గుతాయి. మన దుఃఖానికి కారణం అహంభావన. ఈ దేహం మనం కాకపోయినా దేహమునేను అని అభిమానం కలుగజేసేది అహంభావన. మనందరకు ఆత్మజ్ఞానం లేకపోయినా ఆత్మజ్ఞానం ఉంది అని అనుకొంటున్నాము. ఆధ్యాత్మికంగా పెద్దవారము కాకపోయినా పెద్దవాళ్లము అనుకొంటున్నాము. మనం భౌతికంగా కాని, ఆధ్యాత్మికంగాగాని ఏస్థాయిలో ఉన్నామో అంతకుమించి ఉన్నాము అని అనుకొంటున్నాము. ఉన్నది ఉన్నట్లుగా మనం అనుకోవటంలేదు దీనికి కారణం అహంభావన. మాయతో సంబంధం ఉన్నవాడు జీవుడు, మాయతో సంబంధంలేనివాడు దేవుడు అవుతాడు. మాయతో ఉన్న సంబంధం తొలగించుకోవటానికే మనం ఈ భూమి మీదకు వచ్చాము. భగవంతుడికి అనేక నామాలు ఉన్నాయి. ఆ నామాలను ప్రీతితో స్మరించటంవలన మనం పవిత్రులమవుతాము. మన పురాణాలు ఏమి చెప్పాయి అంటే కలియుగంలో ధ్యానం చేయటం కష్టం, నామం చేయటం తేలిక అని చెప్పారు. అందువలన మీకు ఇష్టమైన భగవంతుని నామాన్ని ప్రేమతో స్మరించుకోండి.

మనస్సుకు లోచూపు కలుగజేయాలి. మోహం ఉన్నవాడికి లోచూపు కలుగదు. ఇది విధి, ఇది నిషేధం అని ఎవరికి తెలుస్తుంది అంటే మోహంలేనివాడికి తెలుస్తుంది. మోహం ఉన్నవాడికి స్థూలబుద్ధి ఉంటుంది, సూక్ష్మబుద్ధి ఉండదు. భగవంతుడు నీ స్వరూపానికి భిన్నంగా లేడు. మన హృదయంలోనే ఉన్నాడు. మన అలవాట్లయొక్క వేగంవలన, వాసనల యొక్క వేగంవలన ఆయన మనకు లభ్యం కావటంలేదు. మనం ఎంత శ్రవణం చేసినా, ఎంత అభ్యాసం చేసినా మనకు కొంత జ్ఞానం వచ్చినప్పటికి వాసన పూర్తిగా నశించకపోతే జ్ఞానం నిలబడదు అని పెద్దలు చెప్పారు. ఏ వాసనల కారణంగా నీ మనస్సు బాహ్యముఖ మవుతోందో అవి పూర్తిగా వేరుతో సహా నశించేవరకు నీవు సంపాదించిన జ్ఞానం నిలబడదు. వాసనాక్షయం అయినప్పడే నీకు శాశ్వతమైన శాంతి, ఆనందం కలుగుతుంది. దేహాభిమానం ఉన్నవాడికి రాగం, ద్వేషం, బంధువులు, స్నేహితులు. దేహాభిమానం లేనివాడికి ఏదీ లేదు. దేహాభిమానం ఒకపట్టానపోదు, దానిని తొలగించుకోవటానికి నెమ్మదిగా జాగ్రత్తగా కృషి చేసుకొంటూ రావాలి. మనదేహం ఆరోగ్యంగా ఉంటే, మన మనస్సు శాంతిగా ఉంటే అదే నిజమైన ఐశ్వర్యం. మనకు జన్మవచ్చిందా

దేహం వస్తుంది. దేహంవస్తే దుఃఖం మనలను వెంటాడుతుంది. పునర్జన్మ ఎప్పుడు నశిస్తుంది అంటే మనం ప్రయత్నం చేయగాచేయగా, గురువును ఆశ్రయించి అభ్యాసం చేయగాచేయగా గురువు అనుగ్రహం వలన వాసన నశిస్తుంది. అప్పుడు పునర్జన్మ నశిస్తుంది. జన్మలేనిస్థితిని మనం పొందాలంటే చావులేని వస్తువు మనకు అనుభవంలోనికి రావాలి. వేద ప్రతిపాదిత పురుషుడు నీ హృదయంలోనే ఉన్నాడు. వేదం ఏవిధంగా నడుచుకోమని చెప్పిందో ఆవిధంగా జీవిస్తూ ఆ పురుషుడిని పొందమని వేదం చెప్పింది. అంతేగాని శివుడు ఎక్కువ, విష్ణువు ఎక్కువ అని వేదం చెప్పలేదు. వేదంలో అనేక విషయాలు ఉన్నాయి గమ్యం అది కాదు గమ్యం ఆత్మజ్ఞానం. నన్ను నేను దేహంగా చూసుకొన్నప్పుడు దేవుడిని కూడా దేహంగా చూస్తాను. దేహంలేనివాడిని మనం ఊహించుకోలేము. అందువలన సాకారాన్ని పెట్టుకొని మనం ఆరాధిస్తున్నాము. ఇతరులకు ఎవరికైనా మనం అపకారం చేసాము అనుకోండి దాని వలన వారు ఎంత బాధపడుతున్నారో మనకు తెలియదు. మరలవారు మనకు అపకారం చేసినప్పుడు వారుపడిన బాధ మనకు తెలుస్తుంది.

బాహ్యవస్తువులు సముపార్జన పట్ల మనకు ఉన్న ఆసక్తి ఆత్మజ్ఞాన సముపార్జన మీద లేదు. ఎందుచేతనంటే దానివిలువ మనకు తెలియటంలేదు. మీరు పదిమంది ఉండగా ఒకరికి అరటిపండు ఇస్తే ఒక అరటిపండు ఫలితమే మీకు వస్తుంది. అదే ఎవరూలేనప్పుడు ఒకరికి అరటిపండు ఇస్తే 70 అరటిపండ్ల ఫలం నీకు వస్తుంది. అంటే గొప్పలతో సంబంధం లేకుండా నీవుచేసే పనివలన 70 వంతులు పెంచి ఈశ్వరుడు బహుమానంగా నీకు ఇస్తాడు. ముముక్షువు పుణ్యాన్ని కోరడు. మన బట్టమీద దుమ్ముపడినట్లు వాడికి పుణ్యం వస్తే రావచ్చునుగాని వాడిలక్ష్యం పుణ్యంమీద ఉండదు. పుణ్యాన్ని కోరుకొంటే వాడు ముముక్షువు కాదు. ముముక్షువు దృష్టి అంతా మోక్షం మీదే ఉంటుంది. నిజంగా మోక్ష కాంక్ష ఉంటే వాడికి పుణ్యం, పాపం గొడవ ఉండదు. పుణ్యం సంపాదించాలి అనుకొంటే పుణ్యం వస్తుంది అనుభవిస్తే పోతుంది చివరకు గమ్యం సున్నా. డిన్నర్‌లు, సన్మానాలు, బజారులో ఉన్న దుమ్ము అంతా మిగులుతుంది. మరణానంతరం చీకటిలోకాలకు వెళతాము. అజ్ఞానం అనే చీకటిలోనుండి ఎవడైతే బయటకు రాలేడో వాడు మానవజాతికి ఏమీ ఉపయోగపడలేడు, శాంతి మార్గాన్ని చూపించలేడు. వెలుగులో ఉన్నవాడు చీకటిలో ఉన్నవాడిని బయటకు తీసుకొనిరాగలడు. ముందునీవు చీకటిని దాటి వెళ్ళాలికదా. విరాట్ స్వరూపం అంటే అంతా ఆత్మగానే చూస్తాడు వాడికి ఎటుచూసినా ఆత్మే, ఎటుచూసినా ఆనందమే. చావు ఎలా ఉంటుందో వాడికి తెలియదు. ఉన్నదేదో ఉంది, నీకు తెలుసున్నా అది ఉంది, తెలియకపోయినా అది నీలోపల ఉంది. నీవు పోగొట్టుకోవలసింది పోగొట్టుకో ఉన్నదేదో నీకు వ్యక్తమవుతుంది. ఆత్మవైభవం మనకు అనుభవంలోనికి వచ్చినప్పుడు ఈ మంత్రాలు, తంత్రాలు ఏవీ మనలను ఆకర్షించవు. నిజం మనకు తెలిసేవరకు నిజంకానిదానిని నిజం

అనుకొని ప్రతిజన్మలోను దాని వెంటపడుతూ ఉంటాము. అది మనరాత. ఈశ్వరవాక్యం మనకు అర్థమయ్యేవరకు, అదిమనకు అనుభవంలోనికి వచ్చేవరకు ఈ రాతలు తప్పవు. హృదయగుహలో స్థిరపడేవరకూ ప్రతీజన్మలోనూ ఏదో ఆకర్షణ నీకు కలుగుతూ ఉంటుంది.

ఒక విషయం పట్లగాని, ఒక వ్యక్తిపట్లగాని, ఒక ప్రాంతంపట్లగాని ఎక్కువ స్నేహం పెట్టుకోవద్దు. అతిగా అభిమానం పెట్టుకొంటే మనస్సు బాహ్యానికి వచ్చేస్తుంది. తగుమాత్రంగా ఉండు. లోకంకాదు నీకు మోక్షం ఇచ్చేది, నేను నీకు మోక్షం ఇస్తాను అని భగవంతుడు చెప్పాడు అంటే లోపల ఉన్న సత్యవస్తువే నీకు మోక్షాన్ని ఇస్తుంది అందువలన దానికి ప్రీతి కలిగేమాట మాట్లాడు, దానికి ప్రీతికలిగే పనిచెయ్యి. మనం మాట్లాడేమాట, మనం చేసేపని, మనకు వచ్చే తలంపులు, చదివే పుస్తకాలు, మనం చేసే స్నేహాలు బంధం నుండి బయటకు రావటానికి మనకు సహకరించాలి. అది సాహిత్యం. మనం చదివే పుస్తకాలు, మనం చేసే స్నేహాలు నీవు బంధింపబడటానికో, నీ మనస్సు ప్రకోపంచెందటానికో, నీకు నెగిటివ్ ఆలోచనలు రావటానికో సహకరిస్తూ ఉంటే అది సాహిత్యం కాదు అది నీ మృత్యువుకు ద్వారం అవుతుంది. మనం చేసేపని, చదివే పుస్తకాలు మనస్సు హృదయంయొక్క లోయలలోనికి వెళ్ళటానికి సహకరించాలి. ఒక్క బ్రహ్మం తప్పించి మిగిలినవన్నీ అప్రధానములు. గురువుయొక్క మౌనం అన్నింటికంటే బిగ్గరగా జరిగే ఉపదేశం. నీకు సాధనాబలం ఉంటే, తపోబలం ఉంటే గురువు యొక్క మౌనం నీకు అర్థమవుతుంది. గురువు యొక్క మౌనం సంపూర్ణంగా ఉంటుంది, సమగ్రంగా ఉంటుంది. గురువు యొక్క మౌనంలోనుండే అనుగ్రహం నీకు అందుతుంది. వాడు ఎంతటివాడైనా అనుగ్రహం లేకుండా ఆత్మానుభవం ఎవడికీ కలుగదు. గురువు అనుగ్రహంలో పడ్డవాడికి ఇంక క్షోభ ఉండదు. బాహ్య పరిస్థితులు వాడికి అనుకూలంగా ఉన్నా, ప్రతికూలంగా ఉన్నా అవి వాడిని బాధించవు. వాడి మనస్సు కాలిపోయినా తాడులాగ అయిపోతుంది. మనస్సు సూక్ష్మాతి సూక్ష్మం అవుతుంది. వాడికి లోచూపు కలుగుతుంది, హృదయం యొక్క లోయలలోనికి ప్రవేశిస్తాడు. ఎప్పుడైతే హృదయం యొక్క లోయలలోనికి ప్రవేశించాడో హృదయంలో ఉన్న సత్యవస్తువు ఆ జీవుడిని హృదయంలోనికి గుంజుకొని దాని స్వరూపాన్ని ఇస్తుంది. గురువు యొక్క మాట, చూపు, పరిసరం అంత బలీయమైనవి. మనకు విషయబుద్ధి ఉంది, దేహబుద్ధి ఉంది. వాటిలోనుండి మనలను ఆత్మవైపుకు, హృదయం యొక్క గుహలోనికి మళ్ళించే వరకు గురువు అనుగ్రహం మనలను వెంటాడుతుంది. నీ మనస్సులో ఉన్న వాసనలు రాలేవరకు తడిగుడ్డను పిండినట్లు నీ మనస్సును పిండుతాడు. ఎందుచేతనంటే మిమ్మల్ని బాధ పెట్టటానికి కాదు, మీ చైతన్యస్థాయి పెంచటానికి, మిమ్మల్ని హృదయ గుహలోనికి తీసుకొనిపోవటానికి, మీరు ఏదైతే అయి ఉన్నారో ఆ వస్తువును మీకు అందించటానికి గురువు చేసే ప్రక్రియ అది. గురువుమీద మీకు ఇష్టం ఉన్నా, లేకపోయినా ఆయన చేసేపని మానడు ఎందుచేతనంటే గురువు ఆత్మఅయి ఉన్నాడు.

జీవుడిప్రేమకు అంతం ఉందిగాని గురువు ప్రేమకు ముగింపులేదు. నేను మంచివాడిని, నేను చెడ్డవాడిని అనుకొంటున్నావు. నేను అలాగ ఉన్నాను, నేను ఇలాగ ఉన్నాను అనుకొంటున్నావు. ఇలా అనుకోవటంతోటే కోట్లాది జన్మలు కాలప్రవాహంలో కొట్టుకొని పోతున్నాయి. నీవు ఏమీ అనుకోవద్దు. లోపల బ్రహ్మం ఎలా ఉందో అలా ఉండటం నేర్చుకో.

గుడికి వెళ్ళి నమస్కారం పెడతాము. మనం చేసే పొరపాటు ఏమిటి అంటే శరీరంతో నమస్కారం పెడతాము, మనస్సుతో పెట్టము. చేతులు జోడించటం కాదు మనస్సుకూడా నమస్కరించాలి అప్పుడు దాని ఫలం మీకు వస్తుంది. చేతులు జోడించినీ మనస్సు ఎక్కడో ఉంటే నీ నమస్కారానికి మోసపోయేటంత అమాయకుడుకాదు ఈశ్వరుడు. ఆయన మనకంటే తెలివైనవాడు. అంతేకాదు మనకు ఏది మంచిదో మనకంటే ఈశ్వరుడికి ఎక్కువ తెలుసు. వాడు సర్వజ్ఞుడు, సర్వసాక్షి హృదయంలో సత్యవస్తువు ఎలాగ ఉందో అలాగ నీ మనస్సును హృదయంలో నిలబెట్టి ఉంచటానికి అభ్యాసం చెయ్యి, అప్పుడు నీకు తత్వం తెలుస్తుంది. అంటే అది నీవే అన్న సంగతి నీకు తెలుస్తుంది. ఏది? దేనిని పొందటానికి నీవు సన్యాసం తీసుకొంటున్నావో, ఏది పొందటానికి నీవు యజ్ఞాలు, యాగాలు ఆచరిస్తున్నావో, ఏది పొందటానికి నీవు అరణ్యాలకు వెళ్ళి తపస్సులు చేస్తున్నావో అది ఎవరోకాదు అది నీవే అన్న సంగతినీకు అనుభవం అవుతుంది. అప్పుడు శరీరం చనిపోయినా, నీవు చనిపోవటం లేదు అని నీకు అనుభవంలోనికి వస్తుంది. నీ హృదయంలో ఉన్న నిజం తెలిస్తే నీకు స్వేచ్ఛ కలుగుతుంది. అంతవరకు నీకు స్వేచ్ఛలేదు. నీ హృదయంలో ఉన్న నిజం తెలిశాక అప్పుడు నీవు గుణాతీతుడవు అవుతావు, జీవన్ముక్తుడవు అవుతావు. సూర్యుడికి చీకటి ఏ విధంగా కనబడదో అలాగే జీవన్ముక్తుడికి దుఃఖం, అశాంతి కనబడదు. ప్రపంచంలో ఏమీ లేదు, అంతా గుల్లే. నీకు ఉన్న కోరికల వలన, వాసనల వలన ఏదో ఉందని అనిపిస్తోంది. ప్రపంచంలో ఏదో ఉంది, ఏదో ఉంది అని అనుకొన్నంతకాలం ఈ భూమిమీదకు వస్తూనే ఉంటావు. ఈ లోకంలో ఏమీ లేదు అని తెలిసిన తరువాత అది నీకు అనుభవం అయ్యాక ఇంక ఈ లోకంలోనికి రావు. నీవు ప్రయత్నం చేయగా చేయగా గురువు అనుగ్రహం వస్తుంది. నీకు మాయతో ఉన్న సంబంధం, అజ్ఞానంతో ఉన్న సంబంధంను కట్ చేస్తుంది. అప్పుడు నీవు బ్రాహ్మీస్థితిని పొందుతావు.. దేవుడు నీలోపలే ఉన్నాడు అని శాస్త్రం చెపుతోంది. ఉంటే ఏమిటి ప్రయోజనం. ఆ దేవుడు నీకు అనుభవంలో లేనప్పుడు నీలోపల ఉంటే మటుకు నీకు ప్రయోజనం ఏమిటి? దేవుడిని అనుభవంలోనికి తెచ్చుకోవటానికి నీవు ప్రయత్నం చేయాలి. నీ సాధనను అంతాదానిమీద గురిపెట్టాలి. నీ జీవితం యొక్క ప్రయోజనం అదే.

# వాచామౌనం నిజమైన మౌనం కాదు, మనస్సు అణగటమే నిజమైన మౌనం

## సద్గురు శ్రీ నాన్నగారి అనుగ్రహభాషణములు, 10-1-2001, జిన్నూరు

ప్రియమైన ఆత్మబంధువుల్లారా!

జ్ఞానికి పుట్టుకలేదు, చావులేదు ఎందుచేతనంటే జ్ఞాని ఆత్మఅయి ఉన్నాడు. పుట్టుక, పెరుగుదల, చావు ఇవి కేవలము శరీరానికే పరిమితం. సంసారం అంటే ఇంటిలోని వ్యక్తులుకాదు జనన, మరణచక్రాన్ని సంసారం అంటారు. ఈ చక్రంలోనుండి బయటకు రావటానికి మనకు అధ్యయనం ఒక్కటే సరిపోదు. దానికి తపస్సు అవసరం, సత్పురుషుల సహవాసం అవసరం, ఈశ్వరానుగ్రహం అవసరం. ప్రపంచంలో మానవుడికి ఏ కష్టం వచ్చినా దానికి కోరికే కారణం. కోరికవలన మనస్సు బాహ్యముఖానికి వెలుతుంది. ఏ కోరిక లేనివాడికి ఈ సృష్టి అంతా గడ్డిపరకతో సమానము. ఆధ్యాత్మిక పురోగతికి నియమాలు చాలా ఉన్నాయి. ఆహారనియమం ఉత్తమమైనది అని భగవాన్ చెప్పారు. మనం తినే ఆహారాన్ని బట్టి మనస్సు, దేహము తయారవుతున్నాయి అందుచేత ఆహారం విషయంలో బహుజాగ్రత్తగా ఉండాలి. మనందరము ఫెయిలైపోవటానికి కారణం ఏమిటి అంటే మనకు భక్తి ఉందికాని అది మెటీరియల్ భక్తి, ఆధ్యాత్మికభక్తికాదు. మనకు ఎవరికి జ్ఞానం అక్కరలేదు. కోరికలు నెరవేరటంకోసం దేవతలను ఆరాధిస్తామ అది మెటీరియల్ భక్తి అవుతుంది. మెటీరియల్ భక్తి వలన మోక్షంరాదు, ఆధ్యాత్మికభక్తి అవసరం. భగవంతుడు చెప్పిన పనిని మనస్సు అర్పించి చేయటమే భక్తి. అలా అర్పించి చేయటం వలన రాగద్వేషములకు దూరమవుతాము. మన అహంకారం చెప్పినమాట ప్రమాణం కాదు. భగవంతుడు చెప్పిన వాక్యాన్ని మనకు ఇష్టం ఉన్నా, లేకపోయినా దానిని ప్రమాణంగా తీసుకొని జీవిస్తే మనకు భక్తి కలుగుతుంది. మన భక్తి నిజమైతే భక్తి వలన శక్తి వస్తుంది, మోక్షం వస్తుంది. మన భక్తి నిజంకాదు కాబట్టి, మన భక్తి మెటీరియల్ భక్తి కాబట్టి మనకు మోక్షం రావటం లేదు. బహుకాలం నుండి మనలో ఉన్న వాసనలు నశించాలంటే బహుకాలం సాధన చేయాలి, దానితోపాటు ఈశ్వరానుగ్రహం ఉంటేగాని వాసన నశించదు. మనం ఎవరిగా ఉన్నామో దానితో మనకు తాదాప్యం లేదు. మనంకానిదానితో తాదాప్యం పొందుతున్నాము. అందులోనుండి విడుదల పొందటానికే తపస్సు. మనలోపల ఉన్న సద్వస్తువుతో అనుసంధానం కలగటానికి నిర్మలత్వం సహకరిస్తుంది. ఆందోళన సహకరించదు, అశాంతి సహకరించదు. నిర్మలమైన మాట, నిర్మలమైన పని, నిర్మలమైన మనస్సు లోపలఉన్న వస్తువును తెలుసుకోవటానికి సహకరిస్తాయి. నేను ఇలా ఉన్నాను, నేను అలా ఉన్నాను అనుకొంటే వాడు జీవుడు. నేను ఇలా ఉన్నాను, నేను అలా ఉన్నాను అని అనుకోకుండా వాడు వాడుగా ఉంటే వాడే దేవుడు. యజ్ఞ, దాన, తపస్సుల వలన మనం పవిత్రులమవుతాము. పూజ,

జపం, ధ్యానం వలన లోపలవస్తువును ఎప్పుడో కాదు ఈ జన్మలోనే పొందాలనే కృతనిశ్చయం నీకు కలుగుతుంది. ఈ దేహం కేవలం అన్నతినటానికి రాలేదు. ఈ దేహం ఎప్పుడు, ఎక్కడ, ఎలా ఉండాలో ఏపని చేయాలో అది దేహం ద్వారా జరుగుతూ ఉంటుంది. అది పూర్తి అయ్యేవరకూ దేహానికి చావురాదు. మనకు ప్రతీ విషయానికి అనుమానమే. ఇంక భగవదనుగ్రహం ఏమి పొందుతాము. మనకు సబ్జక్టు సరిగా అందకపోతే చెప్పేవాడు సరిగా చెప్పలేదు అనుకొంటాము గాని మనకు అర్థం కావటంలేదు అని అనుకోము. మనకు పుణ్యబలం లేదు, సహృదయంలేదు. భగవాన్ ఏదైనా మాట చెపుతారు అనుకోండి అది నిజమే ఎందుచేతనంటే అక్కడ నోరుమాట్లాడటం లేదు ఆయన ఆత్మ అయి చెపుతున్నాడు. నిరంతరం అసూయతో కాలిపోయేవారికి జ్ఞాని మాటలు ఏమి అర్థమవుతాయి. మనకు అందటం లేదు కాబట్టి అవి అసత్యం అనుకోకూడదు. కొంతమంది మంచిపనులు చేస్తారు. కర్మఫలం ఆశించకపోయినా పుణ్యాన్ని ఆశిస్తారు. ప్రమాదం ఎక్కడ ఉంది అంటే పుణ్యం వలన కూడా పునర్జన్మ వస్తుందని వారికి తెలియటంలేదు. బ్రహ్మం అనే తెరమీద వ్రాయబడి నటువంటి చిత్రం ఈ నామ రూపజగత్తు అంతా కూడా. నామ రూపముల యొక్క మోహంలో పడితే ఆ ప్రవాహంలో కొట్టుకొని పోతావు. నామరూపములను మర్చిపోయి పని చేయాలి అదే యజ్ఞం.

భగవాన్‌కు ఏదైనా ఆకర్షణ ఉంది అంటే అది అరుణాచలమే. వైకుంఠంలో నారాయణుడు ఉన్నాడు, కైలాసంలో శివుడు ఉన్నాడు, అరుణాచలంలో శివుడు ఉండటంకాదు అరుణాచలమే శివుడు. అందుచేత నీవు అరుణాచల ప్రదక్షణచేస్తే సాక్షాత్తు శివుడికి ప్రదక్షణం చేసినట్లే. నీకు నిజం తెలియకపోయినా శివుడికి తెలుసు ఏది నిజమో అక్కడికి తీసుకొని వెళ్ళే వరకూ వెంటాడుతాడు అదే అనుగ్రహం. మలిన మనస్సు, విషయాకారం చెందిన మనస్సు ఎంతసేపు బాహ్యముఖానికి వెళుతుంది. వాడు శాస్త్రం విన్నా అర్థంకాదు. ఎందుచేతనంటే వాడికి పుణ్యబలం లేదు, అర్హత లేదు. సూక్ష్మమనస్సు ఉన్న వాడికి, పుణ్యబలం ఉన్నవాడికి లోపలఉన్న వస్తువు డైరెక్టుగా కాకపోయినా కిటికీలో నుండి బయటవస్తువు ఎలా గోచరమవుతుందో అలా గోచరమవుతుంది. నీ కంఫర్ట్స్, నీ ప్లెజర్స్‌ను చూసుకొంటూ ఉంటే లోపలఉన్న వస్తువు నీకు ఏమి ఎరుకపడుతుంది అన్నారు స్వామీజీ. వాటిని విడిచిపెట్టినప్పుడు కదా, వాటిని త్యాగం చేసినప్పడు కదా వస్తువు నీకు వ్యక్తమయ్యేది. నీవు స్మశానానికి వెళ్ళేవరకు నీ దేహానికి కంఫర్టు, ఇంద్రియాలకు ప్లెజర్స్ కోరుకొంటూ ఉంటే నీ మనస్సుకు ఎప్పుడు అంతర్‌దృష్టి కలుగుతుంది. అంతర్దృష్టి కలిగితేకదా ఆత్మజ్ఞానం కలిగేది. హృదయం యొక్క లోయలలోనికి వెళ్ళటానికి ముందు సాత్విక బుద్ధిని ఆశ్రయించాలి. సాత్విక బుద్ధిని ఆశ్రయిస్తే అదే తీసుకొని వెళుతుంది. కొంతమంది ఇన్‌ఫర్‌మేషన్ జ్ఞానం అనుకొంటారు. తెలుసుకోవటం జ్ఞానం కాదు. గీతలో 10 శ్లోకాలు కంఠతా పడితే అది

జ్ఞానం కాదు. నీవు ఏదిగా ఉన్నావో అదిగా ఉండటమే జ్ఞానం. చల్లగాలి మన చర్మానికి తగిలితే మనకు ఎంత స్పష్టంగా తెలుస్తుందో జ్ఞానిలో నుండి వచ్చే తరంగాలు అంత స్పష్టంగా మన గుండెను తాకుతాయి. ఇది కల్పితంకాదు. ఇది నగ్న సత్యం. వాడు పుస్తకాలు వ్రాయనక్కరలేదు, ప్రసంగాలు చేయనక్కరలేదు. బ్రహ్మానుభవం కలిగినవాడు ఎక్కడో మారుమూల కూర్చొన్నా వాడి ద్వారా ఈ లోకానికి మేలు జరుగుతుంది. వాడినుండి వచ్చే శాంతి తరంగాలు, జ్ఞాన తరంగాలు ఈ భూమిని తడుపుతూ ఉంటాయి. మనం సహజంగా చేసేపని అసహజంగా చేయకూడదు. దాని వలన ఈశ్వరానుగ్రహానికి పాత్రులు కాలేము. మనం చేసే పనులలో వ్యక్తి భావన కలువకుండా చేస్తే దైనందిన జీవితంలో నీ పనులు జరిగిపోతాయి, నీ శరీరం పడిపోయే లోపు నీకు ముక్తి వస్తుంది. గుర్తింపులు కోరేవాడికి రంపంపెట్టి కోసినా వాడికి జ్ఞానంరాదు. గుర్తిపులు మన స్వరూపానికి ఘనలను దూరం చేస్తాయి.

ప్రాధమికంగా మనం చేసే తప్పు ఏమిటి అంటే ఆత్మ అంటే ఎవరో అనుకొంటున్నాము. అది మనమే అన్న సంగతి మర్చిపోయాము. మనలనే ఏదో విషయంగా మార్చుకొని ఎక్కడో వెతుకుచున్నాము. మలినమనస్సు ఎలాగ ఉంటుంది అంటేవాడు మంచిపని చేయడు, వాడు మంచిపని చేసినట్లు లోకం అంతా అనుకోవాలి అని అనుకొంటాడు. మలిన మనస్సు మనోమూలాన్ని వెతకలేదు, నిశ్చలమనస్సు వెతకగలదు. జ్ఞాని సమక్షంలో వాడి మాటలతో పనిలేదు, వాడు మౌనంగా ఉన్నా సరిపోతుంది. నోరు మూసుకోవటం వలన వచ్చే మౌనం కాదు, మనస్సు ఎక్కడయితే అణిగిందో అక్కడనుండి వచ్చే మౌనం భోదచేస్తుంది. అది నిజమైన టీచింగ్. చెత్తకు నిప్పు పెడితే ఎలా భస్మం చేస్తుందో అలాగ నీకు ఎన్ని సందేహాలు ఉన్నా మౌనం వాటిని భస్మం చేసుకొంటూ వెలుతుంది. మౌనం నీ మాటకు, మనస్సుకు అందదు, నీమాట, మనస్సు అణిగితే అది నీకు అందుతుంది. అజ్ఞానఅంధకారంలో ఉన్న మనకు గైడ్ చేయటానికి జ్ఞాని యొక్క మౌనం చాలు. జ్ఞానియొక్క సమక్షంలో ఉన్నప్పడు జ్ఞానం యొక్క విలువ మనకు తెలుస్తుంది, మనం కూడా జ్ఞానం సంపాదించాలి అనే తపన లోపల నుండి ఉబికి, ఉబికి వస్తుంది. జ్ఞాని యొక్క సమక్షంలో పునర్జన్మలను తీసుకొనివచ్చే వాసనలకు నిప్ప అంటుకొంటుంది. అవి కాలి బూడిద అవ్వటానికి కొంతకాలం పట్టవచ్చు. తీర్థాలు, క్షేత్రాలు జ్ఞాని సమక్షం ముందు సరిపోవు అంటే వాటికి విలువలేదు అనికాదు, దానిముందు ఇవి సరిపోవు. చూపు, స్పర్శ, భోద ఇవి అన్నీ కలిపి ఏమి చేస్తాయో మౌనం అదే చేస్తుంది. జ్ఞాని సమక్షంలో నీకు తెలియకుండా నీ మనస్సు పరిశుద్ధమవుతుంది. సమూలంగా, సమగ్రంగా నిన్ను అన్ని వైపులనుండి తోమి విడిచిపెడుతుంది జ్ఞాని యొక్క మౌనం. నీవు ఎలా మాట్లాడితే పక్కానికి వస్తావో, ఎటువంటి ఆలోచనలు వస్తే ముగ్గుతావో, ఎవరితో స్నేహం చేస్తే ముగ్గుతావో, ఎటువంటి గ్రంధాలు అధ్యయనం చేస్తే నీవు పక్కానికి

వస్తావో చూసుకొని ముందు నీవు ముగ్గటానికి ప్రయత్నం చెయ్యి. నీ ప్రవర్తన అంతా నీవు పక్వానికి రావటానికి సహకరించాలి. నీవు బాగా పక్వానికి వచ్చిన తరువాత సత్యాన్ని రియలైజ్ చేయటానికి ఫిట్ అవుతావు. అప్పడు సత్యవస్తువుతో తాదాప్యం పొందుతావు. అది జ్ఞానం. అంతవరకు నిన్ను, జ్ఞాని యొక్క మౌనం విడిచిపెట్టదు. అది జ్ఞాని యొక్క వైభవం.

**పనిలో భగవంతుని చూడటం నేర్చుకోవాలి. భగవంతుడు చెప్పిన విధంగా పనిచేస్తే పవిత్రులము అవ్వతాము. పని మనలను బంధించదు. ఫలితముపట్ల మనకు ఉన్న ఆసక్తి మాత్రమే బంధిస్తుంది. కర్మఫలత్యాగికి చిత్తశుద్ధి కలుగుతుంది. ధ్యానపరునికి ఏకాగ్రత సిద్ధిస్తుంది. చిత్తశుద్ధి, ఏకాగ్రత ఈ రెండూ ఉన్నవాడికి ఉజ్వలమైన భవిష్యత్ ఉంటుంది. అతనికి అసాధ్యం అంటూ ఏమీ ఉండదు.**

## శ్రీ రమణ క్షేత్రం వారి పబ్లికేషన్

| నెం. | పుస్తకం పేరు | వెల |
|---|---|---|
| 1. | చిదాకాశంలో చింతకాంతి | 25/- |
| 2. | అమృత వాక్కులు | 20/- |
| 3. | శ్రీ రమణ ప్రస్థాన త్రయం | 12/- |
| 4. | దైవ సంపద | 10/- |
| 5. | జ్ఞాన కిరణాలు | 6/- |
| 6. | అక్షరమణమాల ఉపదేశసారము | 4/- |
| 7. | రమణ భాస్కర బైండులు, 1999-2000 | 100/- |
| 8. | రమణ భాస్కర బైండులు, 1998-1999 | 75/- |
| 9. | శ్రీ రమణ మహిమలు | 10/- |
| 10. | The Call of the Holly Hill | 20/- |

పై పుస్తకములు 50 ప్రతులకు పైన తీసుకున్నవారికి 25% డిస్కౌంటు ఇవ్వబడును.


## మా వద్ద లభించు శ్రీరమణాశ్రమం తిరువన్నామలై వారి పుస్తకములు

| నెం. | పుస్తకం పేరు | వెల |
|---|---|---|
| 1. | నీ సహజ స్థితిలో ఉండు | 50/- |
| 2 | శ్రీ రమణ భాషణములు | 80/- |
| 3. | శ్రీ రమణ లేఖలు | 80/- |
| 4. | శ్రీ రమణ దివ్య జీవిత మకరందం | 50/- |
| 5. | ఆత్మ సాక్షాత్కారము | 80/- |
| 6. | శ్రీ మహర్షి | 20/- |
| 7. | శ్రీ రమణ మహర్షివారి ఉపదేశము | 20/- |
| 8. | శ్రీ రమణోల్లిష్టము | 10/- |
| 9. | నేను ఎవడను? | 3/- |
| 10. | నాయన | 100/- |
| 11. | శ్రీ రమణ గీత | 10/- |
| 12 | శ్రీ రమణ కథా సుధ | 10/- |
| 13. | శ్రీ రమణ వైభవము | 40/- |
| 14. | ఋభు గీతాసారము | 15/- |


పై పుస్తకములు 50 ప్రతులకు పైన తీసుకున్నవారికి 10% డిస్కౌంటు ఇవ్వబడును.

## పాలకొల్లులో శ్రీ షిరిడీ సాయిబాబా ఆలయ శిఖర ప్రతిష్ఠ

పాలకొల్లు పట్టణంలో బంగారువారి చెరువుగట్టు, ఆదిత్య కాలనీలోని శ్రీ సాయిబాబావారి మందిరమునందు స్వస్తిశ్రీ చాంద్రమాన శ్రీ విక్రమనామ సంవత్సరం ది॥ 26-2-2001 సోమవారం ఉదయం గం॥ 8-00లకు శ్రీ షిరిడీ సాయిబాబా వారికి వెండి సింహాసనం మరియు మకరతోరణములను శాసన సభ్యులు గౌ॥ శ్రీ అల్లు వెంకటసత్యనారాయణ దంపతులచే ఆవిష్కరింపబడినది. ఫాల్గుణ శుద్ధ పంచమి అనగా ది॥ 28-2-2001 బుధవారం ఉదయం గం॥ 7-34 ని॥లకు అశ్వనీ నక్షత్రయుక్త మీన లగ్నమునందు శ్రీ అద్దేపల్లి విశ్వనాధం, శ్రీమతి శేషారత్నం దంపతులచే శిఖర ప్రతిష్ఠాపన మహోత్సవము జరిగినది.



శ్రీ రమణాశ్రమం, తిరువన్నామలై



ఆంధ్రాశ్రమం, తిరువన్నామలై



శ్రీ రమణ క్షేత్రం, జిన్నూరు

REGISTERED NEWS PAPER RNI NO. APTEL/1999/1667-POSTAL REGN.NO. AP/VJA/32/5/2000




To

A. Lakshmi
Plot No. 150, Rao & Raju Colony
Banjara Hills, Road No. 2
HYDERABAD - 500 034

*If undelivered please return to :*

**RAMANA BHASKARA**
SRI RAMANA KSHETRAM,
**JINNURU - 534 265.** W.G. Dt. A.P.

Editor, Printer, Publisher : **P.S. RAMA RAJU**
Lakshmi Modern Rice Mill, Ullamparru, PALAKOL - 534 260. W.G. Dt. ☎ : 08814-24589, 24689
Printed at : **SHRIRAM GRAPHICS**, Bank Street, PALAKOL - 534 260. W.G. Dt. ☎ : 22438, 24278